సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 21 । జూన్ । 2024



అప్రమత్తతే ముఖ్యం..

నానాటికీ పెరుగుతున్న సైబర్ నేరాల బారి నుంచి రక్షించుకోవాలంటే అప్రమత్తతే ముఖ్యమని పోలీసులు సూచిస్తున్నారు. 8లో



పెండింగ్‌లో అద్దె బిల్లులు

జిల్లాలో 785 అంగన్‌వాడీ కేంద్రాలకు పది నెలలుగా అద్దె బిల్లులు విడుదల కాకపోవడంతో టీచర్లు, ఆయాలు ఇబ్బంది పడుతున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 26°

జిల్లాలో శుక్రవారం ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది. రాత్రి వాతావరణం కూడా ఉక్కపోతగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలను అలంకరించారు. ఆ తర్వాత అర్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ పాల్గొన్నారు.


కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్



కలెక్టర్‌ను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్

చుంచుపల్లి: నూతనంగా జిల్లాకు బదిలీపై వచ్చిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు గురువారం ఐడీఓసీలో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి సత్వర పరిష్కారం చూపాలని, జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజాప్రతినిధులుగా తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా భాస్కర్ బాధ్యతలు



చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న భాస్కర్‌నాయక్

కొత్తగూడెంరూరల్: ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా ఎల్.భాస్కర్ నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖ సిబ్బంది, అధికారులు విధుల్లో సమయపాలన పాటించాలని, ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని అన్నారు. ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణలో జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మధు, వరుణ్, రాకేష్, ఆర్. చైతన్య డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఫైజ్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పీహెచ్‌సీ పరిధిలోని పెద్ద తండాలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. 1 నుంచి 19 సంవత్సరాల వారికి విధిగా అల్బెండజోల్ మాత్రలు వేయించాలని, అప్పుడే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. జిల్లాలో గురువారం మాత్రలు వేసుకోని వారు ఈనెల 27న తీసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సోనా, డాక్టర్ స్వప్న, ఈఓ రాంప్రసాద్ పాల్గొన్నారు.

మరో ముందడుగు..

కార్పొరేషన్ దిశగా కొత్తగూడెం

- సీఎం రేవంత్‌రెడ్డి చెంతకు ప్రతిపాదనలు
- సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి
- కొత్తగూడెం – పాల్వంచ విలీనంపై అధ్యయనానికి అంగీకారం
- వేగవంతం కానున్న జిల్లా అభివృద్ధి

కొత్తగూడెం–పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదనల విషయంలో మరో కీలక అడుగు పడింది. ఈ రెండు పట్టణాలను విలీనం చేసేందుకు గల అవకాశాల పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



కొత్తగూడెం పట్టణం వ్యూ

సీఎం సానుకూలం..

జంట పట్టణాలుగా ఉన్న కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సమీప గ్రామాలను కలుపుతూ కొత్తగూడెం కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీసుకెళ్లారు. గత ఫిబ్రవరిలో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా భద్రాచలంలో ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో దాదాపు మూడు నెలల పాటు ఈ అంశంపై స్తబ్దత నెలకొంది. ఎన్నికలు ముగిసిన తర్వాత ఈనెల 19న సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కేబినెట్ మంత్రులను కూనంనేని సాంబశివరావు స్వయంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు సమస్యలు, అభివృద్ధి పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

అప్‌గ్రేడ్‌కు అవకాశం ఉంటే..

కొత్తగూడెం – పాల్వంచ మున్సిపాలిటీలను విలీనం చేస్తూ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదనపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ అంశంపై మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అధ్యయనం చేస్తామని అన్నారు. రెండు పట్టణాలను కలపడం వల్ల లాభనష్టాలను అంచనా వేసి, అవకాశం ఉంటే కార్పొరేషన్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడంతో ఇప్పుడు బంతి మున్సిపల్ శాఖ పరిధిలోకి వెళ్లినట్టయింది. దీంతో ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాలను ఎప్పుడు నియమిస్తారు.. క్షేత్రస్థాయి పరిశీలన ఎప్పుడు.. విలీనంలో ఉండే ఇబ్బందులను ఎలా అధిగమిస్తారు.. అనే అంశాలపై జిల్లాలో ఆసక్తి నెలకొంది.


మౌలిక రంగాల్లో వెనుకబాటు..

కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు పారిశ్రామిక ప్రాంతాలుగా గత 40 ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ వంటి కార్పొరేషన్ స్థాయి సిటీకి పోటీ అన్నట్టుగా 1980, 90 దశకాల్లోనే ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మంచి ఆస్పత్రులు, స్కూళ్లు అందుబాటులోకి వచ్చాయి. వాణిజ్య రంగంలోనూ దూసుకుపోయింది. ఆ తర్వాతే ఈ అభివృద్ధిలో వేగం మందగించింది. జిల్లా ఏర్పాటు తర్వాత కొంత స్తబ్దత వీడినా ప్రైవేటు రంగంలో పెట్టుబడులు ఆగిపోయాయి. మరోవైపు తెలంగాణ ఏర్పాటు తర్వాత ఖమ్మంతో పాటు అనేక పట్టణాలు అభివృద్ధిలో దూసుకుపోయాయి. ఫలితంగా విద్య, వైద్యం వంటి మౌలిక రంగాల్లో జిల్లా వెనుకబడిపోయింది. ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ తదితర నగరాలపై ఆధారపడాల్సి వస్తోంది. కొత్తగూడెం – పాల్వంచ విలీనమై కార్పొరేషన్‌గా మారి, మౌలిక రంగాల్లో అధునాతన సదుపాయాలు అందుబాటులోకి వస్తే జిల్లాకు గ్రోత్ ఇంజన్‌లా మారుతుంది. అంతేకాక ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీలోని ఏజెన్సీ వాసుల అవసరాలూ తీరుతాయి.

అనుకూలతలు – చిక్కులు..

ప్రస్తుతం కొత్తగూడెం మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా దాదాపు 90 వేల జనాభా ఉంది. పాల్వంచ మున్సిపాలిటీలో 24 వార్డులు ఉండగా లక్ష వరకు జనాభా ఉంది. ఇక కొత్తగూడెం మున్సిపాలిటీలో కలిసిపోయినట్టుగా ఉండే లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, పాల్వంచ మండలాల్లో చాలా గ్రామపంచాయతీలు దశాబ్దాల క్రితమే అర్బన్ ప్రాంతాలుగా మారాయి. కొత్తగూడెం, పాల్వంచతో పాటు సమీప సెమీ అర్బన్ ప్రాంతాలను కలిపితే జనాభా రెండున్నర లక్షలకు పైగానే ఉంటుంది. వ్యవసాయం కంటే ఇతర రంగాలపై ఆధారపడి జీవిస్తున్నవారే ఎక్కువ. ఇలా సాంకేతికంగా కార్పొరేషన్ ఏర్పాటుకు అనుకూలతలు ఉన్నప్పటికీ, ఏజెన్సీ ఏరియాలో ఉండే చట్టపరమైన చిక్కులను ఎలా అధిగమిస్తారనేది కీలకమైన అంశంగా మారనుంది.

సీఎం సానుకూలంగా ఉన్నారు..



పాల్వంచ – కొత్తగూడెం పట్టణాలను కలిపి కార్పొరేషన్‌గా విలీనం చేయాలనే ప్రతిపాదనకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. దీంతో కార్పొరేషన్ ప్రతిపాదనల విషయంలో మరో అడుగు ముందుకు పడింది. ఈ రెండు పట్టణాలు కలిసి కార్పొరేషన్‌గా మారితే జిల్లా మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

– కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

అందరికీ ఇళ్లు, విద్య, వైద్యమే లక్ష్యం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి తదితరులు

- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ముగిసిన టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర మహాసభలు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్లు, విద్య, వైద్యం ఉచితంగా అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఖమ్మంలో రెండు రోజులుగా జరుగుతున్న టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర మహాసభలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో భట్టి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. మీడియా సంస్థల యాజమాన్యాల ఆలోచనలు ఎలా ఉన్నా జర్నలిస్టులు మాత్రం ఉన్నత ఆలోచనలతో నిజాలు మాత్రమే రాయాలని సూచించారు. మంచి జర్నలిజానికి తమ ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభిమతానికి అనుగుణంగా పనిచేస్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ వస్తే ప్రజలకు మేలు జరుగుతుందని అందరూ భావించినా గత పదేళ్లలో అలా జరగలేదని చెప్పారు. అంతేకాక మీడియా సహా ప్రజాస్వామ్యంలో ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛ విధ్వంసమైందని ఆయన పేర్కొన్నారు.

ప్రజాహితానికి పాటుపడాలి : మంత్రి తుమ్మల

జర్నలిస్టులు ప్రజాహితం కోసం పాటుపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. స్వాతంత్ర్య పోరాటంలో పత్రికల పాత్ర మరువలేనిదని గుర్తుచేశారు. తెలంగాణలోనూ నిజాం, రజాకార్ల దౌర్జన్యాలను వెలుగులోకి తీసుకొచ్చిన పత్రికలు ప్రజలను చైతన్యం చేశాయని తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు, కరోనా మహమ్మారి సమయాన సామాజిక బాధ్యతగా జర్నలిస్టులు చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని చెప్పారు. కాగా, సోషల్ మీడియా పెను సవాల్‌గా మారిన వేళ కూడా విశ్వసనీయతతో పత్రికల స్థానం చెక్కు చెదరలేదని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పత్రికలు ప్రపంచానికే జ్ఞానం నేర్పిస్తాయని పేర్కొన్నారు. జర్నలిస్టులు పలువురు కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్ అలీ, కె.రాంనారాయణ తదితరులు మాట్లాడగా, పది తీర్మానాలను ఆమోదించారు. ఈ మహాసభలో కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌తో పాటు పోట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, కమర్తపు మురళి, నాయుడు సత్యం, సాధు రమేష్‌రెడ్డి, రావూరి సైదుబాబు, పాలెపు వెంకటరమణ, తుపాకుల ఎలగొండస్వామి, గుర్రం ఉమామహేశ్వరరావు, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విరాహత్ అలీ, రాంనారాయణ

రాష్ట్ర కార్యవర్గంలో స్థానం

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మహాసభల సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన కె.రాంనారాయణ ఎన్నికయ్యారు. ఇంకా ముగ్గురు ఉపాధ్యక్షులు, ముగ్గురు కార్యదర్శులతో పాటు 16మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఎన్నుకోగా ఖమ్మంకు చెందిన ఎం.వేణుగోపాలరావుకు కార్యవర్గ సభ్యుడిగా స్థానం దక్కింది.

సమన్వయంతో పనిచేయండి

- ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి
- అమ్మ ఆదర్శ పాఠశాలలను తీర్చిదిద్దాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశం
- ఇష్టంగా చదవాలని విద్యార్థులకు సూచన



చంద్రుగొండ : విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

అన్నపురెడ్డిపల్లి/చంద్రుగొండ : అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఆయన అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లో పర్యటించారు. ధరణి వెబ్‌సైట్‌ను పరిశీలించి, పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, రైతులను ఇబ్బంది పెట్టవద్దని అధికారులను ఆదేశించారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో సాగవుతున్న పంటల వివరాలపై ఏఓను ఆరా తీశారు. వైద్యసేవలు అందుతున్న తీరు గురించి వైద్యాధికారిణిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం వివరాలపై ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని, కార్యాలయాల పరిసరాలు పచ్చదనంతో నిండి ఉండేలా మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎర్రగుంట జెడ్పీ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలను పరిశీలించిన కలెక్టర్.. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.

ఇష్టంగా చదవండి

ఇష్టంగా చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ అన్నారు. చంద్రుగొండ మండలం మద్దుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. ప్రతిరోజూ పాఠశాలకు హాజరు కావాలని, పాఠాలు ఏవైనా అర్థం కాకుంటే వెంటనే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, పాఠ్య పుస్తకాలు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందుతాయని, తల్లిదండ్రులు ప్రైవేటు మోజులో పడకుండా సర్కారు స్కూళ్లలోనే పిల్లలను చేర్పించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ ఈఈ ఎస్.శ్రీనివాసరావు, డీఈఈ సత్యనారాయణ, సీడీపీఓ నిర్మలా జ్యోతి, తహసీల్దార్లు జగదీశ్వరప్రసాద్, సంధ్యారాణి, ఎంపీడీఓలు మహాలక్ష్మి, బయ్యారపు అశోక్, ఎంపీఓ షాబ్నా, ఎంఈఓ సత్యనారాయణ, ఏఓ అనూష, మండల వైద్యాధికారిణి ప్రియాంక, ఏఈ శ్రీనివాస్, హెచ్‌ఎం భవాని తదితరులు పాల్గొన్నారు.

లాభదాయక సాగు వైపు ప్రోత్సహించాలి

కొత్తగూడెంఅర్బన్: సన్న, చిన్న కారు రైతులను లాభదాయక సాగు వైపు ప్రోత్సహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఆయన ఐడీఓసీలో వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్త తరహాలో వ్యవసాయం చేయించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచొచ్చని చెప్పారు. మునగ సాగు ద్వారా వరి కంటే అధిక ఆదాయం గడించవచ్చని, ఇది కామారెడ్డి జిల్లాలో నిరూపణ అయిందని, ప్రతి వ్యవసాయ అధికారి కనీసం ఒక రైతును ఆ దిశగా ప్రోత్సహించాలని ఆదేశించారు. అలాగే నీటి కుంటల్లో కొర్రమీను పిల్లలను వేసి వాటి పెంపకం ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. వరి సాగు రైతులకు అంతగా లాభదాయకం కాని పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ అంతర పంటగా వేసుకోవచ్చని, ఆయిల్ పామ్ మొక్కల మధ్య అరటి సాగు చేసుకోవచ్చని తెలిపారు. తేనెటీగల పెంపకం ద్వారా కూడా అధిక ఆదాయం ఉంటుందన్నారు. సమావేశంలో డీఏఓ బాబూరావు, ఉద్యానవన అధికారి సూర్యనారాయణ, డీఎంఓ సునీత, జిల్లా విత్తనాభివృద్ధి సంస్థ అధికారి భిక్షం, ఏడీఏ రవికుమార్, ఏఓ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాల సంఖ్య పెంచాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి సులోచనారాణి సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచడంతో పాటు విద్యార్థులకు ఈఏపీ సెట్, నీట్‌లో శిక్షణ ఇవ్వాలని అన్నారు. బయోమెట్రిక్ విధానాన్ని సక్రమంగా నిర్వహించాలని, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న సులోచనారాణి

‘పేట’లో భూమాయ!

- కబ్జాకు గురైన కేయూ గురుకుల భూములు
- సర్వే నంబర్ 1228లో 50 ఎకరాలు కేటాయింపు..
- భూ వివరాలు తెలపాలని స.హ చట్టం ద్వారా ఓ పౌరుడి వినతి
- ప్రస్తుతం ఆ ఫైలే లేదంటూ అధికారుల సమాధానం



గురుకుల పాఠశాలకు కేటాయించిన భూమి ఇదే..

అశ్వారావుపేటరూరల్: రెవెన్యూ శాఖలో జరిగే భూ మాయలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకున్నా ఫలితం ఉండడం లేదు. ఆ శాఖలోని కొందరు ఇంటి దొంగలు భూ ఆక్రమణదారులతో చేతులు కలిపి విలువైన ప్రభుత్వ భూములకు ఎసరు పెడుతున్నారు. ఈ క్రమంలోనే కాకతీయ యూనివర్సిటీ గురుకులానికి కేటాయించిన భూముల ఫైల్ మాయమైంది. ఈ విషయం సమాచార హక్కు చట్టం ద్వారా ఇటీవల వెలుగులోకి వచ్చింది. అశ్వారావుపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1228లో వేలాది ఎకరాల విలువైన ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిలో చాలావరకు కబ్జాకు గురి కాగా, ఆక్రమణదారులంతా దర్జాగా సాగు చేసుకుంటున్నారు. కాగా ఈ కబ్జా వ్యవహారానికి భూ రికార్డుల ప్రక్షాళనలో కూడా మోక్షం కలగలేదు.

గురుకుల భూములు స్వాహా !

నియోజకవర్గాల విభజనకు ముందు అశ్వారావుపేట మండలం సత్తుపల్లి నియోజకవర్గంలో ఉండేది. కాగా, నాటి ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్.. ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత చదువు అందాలనే ఉద్దేశంతో కాకతీయ యూనివర్సిటీకి సంబంధించిన గురుకుల పాఠశాలను అశ్వారావుపేట మండలానికి మంజూరు చేయించడంతో పాటు స్థలా కేటాయింపునకు తొలి ప్రాధాన్యత ఇచ్చారు. యూనివర్సిటీ నిబంధనల ప్రకారం గురుకులం ఏర్పాటుకు ఒకేచోట అనువైన స్థలం కేటాయించాల్సి ఉండడంతో అశ్వారావుపేట మండలం అల్లిగూడెం సమీపంలో సర్వే నంబర్ 1228లో 50 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఈ స్థలాన్ని పరిశీలించిన కేయూ అధికారులు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు భూమి కేటాయిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. అయితే ఆ తరుణంలోనే నియోజకవర్గాల పునర్విభజన జరిగి, సత్తుపల్లి నియోజకవర్గం నుంచి విడిపోయి 2009లో అశ్వారావుపేట నియోజకవర్గం ఏర్పడింది. దీంతో రాజకీయ సమీకరణలు మారి గురుకులం ఏర్పాటు ప్రక్రియ మరుగున పడింది. ఇదే అదునుగా కొందరు రాజకీయ పెద్దలు, ప్రముఖులు ఈ భూమిపై కన్నేసి దొడ్డిదారిన హక్కు పత్రాలు పొందడం బహిరంగ రహస్యమే. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్లు కూడా రికార్డులను తారుమారు చేశారనే ఆరోపణలు వచ్చాయి. పాఠశాలకు కేటాయించిన ఫైల్‌ను సైతం మాయం చేసి, అసలు గురుకుల భూముల వ్యవహారమే లేనట్లు చేయడం కొసమెరుపు.

స. హ.చట్టంతో..

గురుకులం ఏర్పాటు వ్యవహారంపై అశ్వారావుపేటకు చెందిన ఒకరు ఈనెల 1న స.హ చట్టం కింద స్థానిక రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. 1228 సర్వే నంబర్‌లో గురుకులం ఏర్పాటుకు ఎన్ని ఎకరాలు కేటాయించారు.. ఈ భూమి సరిహద్దులు, విస్తీర్ణం బై నంబర్, ఈ భూమి ఎవరి ఆధీనంలో ఉందనే వివరాలు తెలపాలని దరఖాస్తు ద్వారా కోరారు. అయితే గురుకులానికి సంబంధించిన ఫైలే తమ వద్ద లేదంటూ అధికారులు ఈనెల 12న ఆర్‌సీ నంబర్:బీ/343/2024 ద్వారా దరఖాస్తుదారుడికి సమాధానం ఇచ్చారు. కాగా, ఈ భూముల వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టి పెడితే అసలు విషయం వెలుగులోకి వస్తుందని స్థానికులు అంటున్నారు.

నా దృష్టికి రాలేదు

గురుకుల పాఠశాలకు భూముల కేటాయింపుపై నాకు అవగాహన లేదు. పూర్తి వివరాలు తెలుసుకుంటా. త్వరలోనే దీనిపై సమగ్ర వివరాలు సేకరించి వెల్లడిస్తా. స.హ. చట్టం దరఖాస్తులు డీటీ పర్యవేక్షిస్తుంటారు. ఇది నా దృష్టికి రాలేదు.

– కృష్ణ ప్రసాద్, అశ్వారావుపేట తహసీల్దార్

‘అమ్మ పాట’ పుట్టింది ఇక్కడే..

- 20 ఏళ్ల క్రితం గుండాలలోనే రచించా
- రచయిత, గాయకుడు సురేందర్ వెల్లడి

గుండాల: ‘అమ్మపాటే.. జోల పాట.. అమృతాని కన్న తీయనంట..’ అంటూ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో మార్మోగుతున్న పాట 20 ఏళ్ల క్రితం గుండాలలో కిన్నెరసాని నది ఒడ్డున పుట్టిందని రచయిత, గాయకుడు మిట్టపల్లి సురేందర్ వెల్లడించారు. ఖమ్మంలో ఆర్ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గుండాలకు చెందిన గడ్డం సతీష్, విద్యావంతుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సురేందర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు గుండాలతో అనుబంధం ఉందని, 20 ఏళ్ల క్రితం ఇక్కడికి వచ్చినప్పుడు ఈ వాతావరణం తనను అమ్మపాట, అడవి పాట రాసేలా ప్రోత్సహించిందని గుర్తు చేసుకున్నారు. మండలంలోని అనంతోగు గ్రామంలో విషజ్వరాలు, అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించే క్రమంలో రెండు నెలల పాటు ఈ ప్రాంతంలోనే ఉన్నానని తెలిపారు. ఆ సమయంలో కళాకారుడు సరిగమల సత్తితో కలిసి కిన్నెరసాని ఒడ్డున కూర్చున్నప్పుడు అమ్మ గుర్తుకొచ్చి పాట రాశానని వివరించారు. ఈ పాటను ఇటీవల ముంబైకి చెందిన గాయనితో పాడించగా కోట్లాది మంది అభినందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో సురేందర్‌ను సన్మానించగా.. అమ్మపాటను పిల్లలు ఆలపించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ సంఘాల బాధ్యులు కోరం సీతారాములు, ఉపేందర్, వరలక్ష్మి, సంజీవన్ స్మార్ట్, సంతోష్, షారోజ్, బొబ్బిలి పవన్, నితీష్, నాగరాజు, యాకూబ్, తిరుపతి, పాపాచారి, రంజిత్, రాజు, నారాయణ, టి.రాంబాబు, వెంకటేశ్వర్లు, మానాల పూజిత్, శ్రీశైలం, నాగ మల్లయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో చిన్నారులతో సురేందర్

క్లుప్తంగా

సకాలంలో విధులకు హాజరైన ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): ఉద్యోగులు ఆలస్యంగా వస్తే చర్యలు తీసుకుంటామని సింగరేణి సంస్థ బుధవారం రాత్రి సర్క్యులర్ విడుదల చేయడంతో కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయ ఉద్యోగులు గురువారం సకాలంలో హాజరయ్యారు. ఇద్దరు, ముగ్గురు మినహా మిగతా వారంతా సకాలంలో రావడం విశేషం. ఈ విషయమై సింగరేణి డైరెక్టర్(పా) ఎన్వీకే.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాన కార్యాలయంలో సుమారు 40 శాతం మంది ఉద్యోగులు విధులకు ఆలస్యంగా వస్తున్నట్లు గుర్తించి హెచ్ఓడీలకు చెప్పినా మార్పు రాకపోవడంతో సర్క్యులర్ విడుదల చేయాల్సి వచ్చిందని తెలిపారు. త్వరలోనే బయోమెట్రిక్ విధానం అమలుచేయడమే కాక అన్ని శాఖల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

గిరిజన డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

భద్రాచలం/అశ్వాపురం : మణుగూరు(మిట్టగూడెం)లో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల (బాలురు) డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ జితేష్ వి.పాటిల్, కళాశాల ప్రిన్సిపాల్ అనూష గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు ధ్రువీకరణ పత్రాలు నేరుగా స్వీకరిస్తామని, మెరిట్ జాబితా ఈ నెల 25న ప్రకటించి, కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బిల్లులు నిలిపివేస్తాం

కొత్తగూడెం అర్బన్(సింగరేణి): సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న క్వార్టర్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే బిల్లులు నిలిపివేస్తామని సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్వీకే శ్రీనివాస్ హెచ్చరించారు. హెడ్డాఫీస్ వద్ద చేపడుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రూ. కోట్లతో 195 క్వార్టర్లు నిర్మిస్తున్నామని, సివిల్ అధికారులు పనులపై దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు సూర్యనారాయణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి కలప పట్టివేత

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామ సమీపంలో అనుమతి లేకుండా మామిడి చెట్లను నరికి కలపను తరలిస్తుండగా బుధవారం రాత్రి అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. గురువారం జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి ప్రసాద్ రావు వివరాలిలు వెల్లడించారు. కాకర్ల గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో నిరుపయోగంగా ఉన్న మామిడి చెట్లను కొత్తగూడెం మండలం కారుకొండ రామవరానికి చెందిన బండ రాములు అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. మామిడి, వేప చెట్లను నరికి లారీలో అక్రమంగా కలపను తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. కలపను స్వాధీనం చేసుకుని, లారీని సీజ్ చేశారు. రాములుపై కేసు నమోదు చేసి, రూ. 30 వేలు జరిమానా విధించినట్లు ఎఫ్ఆర్ఓ తెలిపారు.

ఇసుక లారీ, ట్రాక్టర్ సీజ్

భద్రాచలంఅర్బన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ, ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని రామచంద్రాపురం నుంచి భద్రాచలం మీదుగా ఏపీలోని ఏలూరుకు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఎస్‌ఐ విజయలక్ష్మి పట్టుకున్నారు. పట్టణంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. రెండు వాహనాలను సీజ్ చేసి, డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేటీపీఎస్ ఉద్యోగి ఆత్మహత్య

కొత్తగూడెం అర్బన్(పాల్వంచ): మద్యానికి బానిస కావడంతోపాటు అనారోగ్య సమస్యలతో కేటీపీఎస్ ఉద్యోగి గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన బానోతు భీమ్‌జీ(42) కేటీపీఎస్ 7వ దశలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నాడు. కేటీపీఎస్ ఐఎం కాలనీ క్వార్టర్ బీఎఫ్ 176లో నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం తెల్లవారుజామున ఇంట్లో ముందు గదిలో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గుర్తించి కిందకు దింపి కేటీపీఎస్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్‌ఐ బి.రాము సందర్శించి మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య లలిత, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు రామోజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెనొప్పితో కూలి మృతి

కరకగూడెం: గుండెనొప్పితో వలస కూలి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని గోవిందాపురం గ్రామంలో గురువారం జరిగింది. ప్లాంటేషన్ డిప్యూటీ మేనేజర్ కోటేశ్వరి కథనం ప్రకారం.. అటవీశాఖకు చెందిన జామాయిల్ మొక్కలు నరికేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు చెందిన పలువురిని గుత్తేదారు మండలానికి తీసుకొచ్చాడు. పని ప్రదేశంలో రమణ (59) అనే వ్యక్తి ఛాతీ నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన తోటి కూలీలు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుత్తేదారుతో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తామని ప్లాంటేషన్ డిప్యూటీ మేనేజర్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

అప్రమత్తతే ముఖ్యం..

- సులభంగా సంపాదనంటే మోసమనే గుర్తించాలి
- అవగాహన, అప్రమత్తతోనే సైబర్ నేరాల నియంత్రణ
- గోల్డెన్ అవర్‌లో సమాచారం ఇస్తే నగదు రికవరీకి అవకాశం



అశ్వాపురం: జిల్లాలో క్రమంగా సైబర్ క్రైమ్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు, కాల్స్‌కు స్పందించి నగదు నష్టపోతున్నారు. జిల్లాలో గత జనవరి నుంచి జూన్ 18 వరకు 2,534 మంది బాధితులు సైబర్ క్రైమ్ బారిన పడ్డామని పోలీసులకు నివేదిచగా, 199 ఘటనల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రూ. 14,89,34,665 బాధితులు కోల్పోయారు. రూ.1,20,08,679 నగదును సైబర్ క్రైమ్ పోలీసులు స్తంభింపజేశారు. అయితే సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అప్రమత్తతే మార్గమని పోలీసులు పేర్కొంటున్నారు.

గోల్డెన్ అవర్‌లో తెలియజేస్తే..

సైబర్ క్రైమ్‌లో నిందితులను పట్టుకునేందుకు గోల్డెన్ అవర్ ఎంతో కీలకం. నష్టం జరగగానే బాధితులు నిమిషాల వ్యవధిలో కేసు గురించి పోలీసులకు తెలియజేస్తే నిందితుడి బ్యాంక్ ఖాతాలు, డిజిటల్ వ్యాలెట్లో ఉన్న నగదును స్తంభింపజేసే అవకాశం ఉంటుంది. తద్వారా బాధితుల సొమ్ము రికవరీ సులభంగా ఉంటుంది.

తక్కువ సమయంలో ఎక్కువ సంపాదన అంటే మోసమే..



మోసగాళ్లు ఆన్‌లైన్ జాబ్స్, వర్క్‌ఫ్రం హోం అంటూ ఆశ పెడుతుంటారు. అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి. టెలిగ్రామ్, వాట్సాప్, ఫోన్ కాల్ ద్వారా ఆన్‌లైన్ జాబ్స్, వర్క్ ఫ్రం హోమ్ వంటి సందేశాలను నిశితంగా గమనించాలి. టెలిగ్రామ్‌ను పోలీసులు ట్రాక్ చేయడం కుదరదు. ఎవరైనా ఉద్యోగాల కోసం మెయిల్ చేస్తే అధికారిక ఈ–మెయిల్ చిరునామా తీసుకోవాలి. ఎల్లప్పుడూ ఫోన్ కాల్‌లో మాట్లాడాలి. టెలిగ్రామ్ కాల్, వాట్సాప్ కాల్‌లో మాట్లాడవద్దు. మోసం చేసేవారు ఎక్కువగా మధురమైన, ఒప్పించే స్వరంతో మాట్లాడుతారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. ఉద్యోగం రిజిస్ట్రేషన్ కోసం డబ్బులు అడిగినా, డబ్బు రెట్టింపు అవుతుందని నమ్మబలికినా అది కుంభకోణం అని నిర్ధారించుకోవాలి. తక్కువ సమయంలో సంపాదనతో జీవితం సులభమని అనుకోవద్దు. అది కచ్చితంగా నష్టానికి దారి తీస్తుంది. దురాశ దుఃఖానికి కారణం.

–జితేందర్, ఇన్‌స్పెక్టర్ సైబర్ సెక్యూరిటీ, కొత్తగూడెం

జనవరి నుంచి జూన్ 18 వరకు నమోదైన సైబర్ కేసుల వివరాలు

	పోలీస్‌స్టేషన్‌లో నివేదించిన కేసులు	ఎఫ్ఐఆర్‌లు	కోల్పోయిన నగదు(రూ.లలో)	స్తంభింపజేసిన నగదు(రూ.లలో)
భద్రాచలంటౌన్	234	22	1,34,08,243	16,32,530
చుంచుపల్లి	139	8	2,89,77,596	41,67,195
లక్ష్మీదేవిపల్లి	117	13	60,17,344	3,30,690
పాల్వంచరూరల్	57	2	32,08,416	1,98,009
దమ్మపేట	62	9	21,45,965	96,915
పాల్వంచటౌన్	391	25	2,08,94,854	20,37,841
జూలురుపాడు	53	2	31,29,086	1,78,453
టేకులపల్లి	58	5	15,79,418	4,75,821
అశ్వారావుపేట	71	7	19,84,190	60,839
మణుగూరు	224	14	1,04,20,632	10,78,380
బూర్గంపాడు	168	8	1,18,49,787	1,31,771
ఇల్లెందు	200	14	76,31,227	3,34,779
సుజాతనగర్	64	1	16,55,328	1,37,142
కొత్తగూడెంటూటౌన్	174	18	75,74,040	1,95,045
దుమ్ముగూడెం	29	0	5,22,114	25,468
ఆళ్లపల్లి	11	2	8,66,729	11,000
అశ్వాపురం	106	8	31,84,787	1,39,742
చర్ల	42	1	12,70,708	-
కొత్తగూడెంవన్‌టౌన్	145	16	1,17,74,679	3,50,680
కొత్తగూడెంత్రీటౌన్	89	24	1,08,39,523	4,26,378
మొత్తం	2534	199	14,89,34,665	1,20,08,679.06

ఫిర్యాదు ఇలా..

సైబర్ క్రైమ్ బాధితులు హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయవచ్చు. cybercrime.gov.in ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. స్థానిక సైబర్ క్రైమ్ విభాగంలో కూడా ఫిర్యాదు చేయవచ్చు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక సైబర్ వారియర్ ఉంటాడు. వారికి బాధితులు ఫిర్యాదు చేయవచ్చు. మోసగాళ్లతో కమ్యూనికేషన్, లావాదేవీల వివరాలు, స్క్రీన్ షాట్ ద్వారా అవసరమైన సమాచారాన్ని ఫిర్యాదులో చేర్చాలి. వివరణాత్మక సమాచారం ఇవ్వడం ద్వారా పోలీసులు ధర్యాప్తు వేగవంతం చేయడానికి అవకాశం ఉంటుంది.

పెండింగ్‌లో అద్దె బిల్లులు

- పది నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు కిరాయి చెల్లించని వైనం
- ఇబ్బందులు పడుతున్న అంగన్‌వాడీ టీచర్లు



రామవరంలోని అంగన్‌వాడీ కేంద్రం

కొత్తగూడెంటౌన్: పది నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బిల్లులు పేరుకుపోయాయి. మరోవైపు కిరాయి చెల్లించాలంటూ టీచర్లపై ఓనర్లు ఒత్తిడి తెస్తున్నారు. జిల్లాలో మొత్తం 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 782 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, మరో 493 కేంద్రాలు ఉచిత భవనాల్లో కొనసాగుతున్నాయి. మరో 785 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.

10 నెలల అద్దె బకాయి..

జిల్లాలో 785 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కో సెంటర్‌కు ఏరియాను బట్టి రూ.1000 నుంచి రూ. 4 వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఒకటి, రెండు లేదా మూడు గదులలో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. కానీ కేంద్రాలకు పది నెలల నుంచి అద్దె చెల్లింకపోవడతో ఇంటి యజమానులతో ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. సమాధానం చెప్పలేక తప్పించుకు తిరగాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. ఒకటి, రెండు నెలలు అద్దెలు తమ వేతనాల నుంచి చెల్లిస్తున్నామని వాపోతున్నారు. ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యంతోనే అద్దె చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బకాయి చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

త్వరలోనే చెల్లిస్తాం



అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బిల్లులు దాదాపుగా తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల కోడ్ వల్ల గతంలో రావాల్సిన బిల్లులు అలస్యమయ్యాయి. ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. త్వరలోనే బకాయిలు చెల్లిస్తాం.

–వేల్పుల విజేత, జిల్లా సంక్షేమశాఖ అధికారి

ఇబ్బందులు పడుతున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలు ఇవ్వకపోవడంతో యజమానులు తాళం వేసి ఖాళీ చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. మేము ఇబ్బందులు పడుతున్నాం.

–గోనె మణి, అంగన్‌వాడీ టీచర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

తక్షణమే చెల్లించాలి



అంగన్‌వాడీ కేంద్రాలకు 10 నెలలుగా రావాల్సిన అద్దె బకాయిలు తక్షణమే చెల్లించాలి. నెలనెలా ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అద్దె చెల్లింపులు పూర్తిచేయాలి.

–ప్రమీల, అంగన్‌వాడీ టీచర్, కొత్తగూడెం.

వ్యవసాయ భూమి ఆక్రమణ



వ్యవసాయ భూమిలో నిర్మించిన రేకుల షెడ్డు

అశ్వారావుపేటరూరల్: ఓ రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో కొందరు అక్రమంగా రేకుల షెడ్డు వేసిన ఘటన గురువారం జరిగింది. బాధిత రైతు కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన రైతు బత్తుల తిరుమలేష్‌కు ఆసుపాక రెవెన్యూ మౌజా సర్వే నంబర్లు 281/అ విస్తీరణం 21 కుంటలు, సర్వే నంబరు 288/అ విస్తీరణం 1.03 కుంటలు.. మొత్తం 1.24 కుంటల వ్యవసాయ భూమి ఉంది. ఇది అతని పూర్వీకుల నుంచి వచ్చింది. ఇందుకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, ధరణి డిజిటల్ పట్టాదారు పాసుబుక్ సైతం పొందాడు. ఈ భూములు వినాయకపురం గ్రామంలోని ప్రధాన సెంటర్‌కు సమీపంలో, ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్నాయి. అయితే భూములతో సంబంధం లేని అదే గ్రామానికి చెందిన నల్లపు నరసింహారావు, నల్లపు లక్ష్మీపతి, చిత్రోతు శ్రీనివాసరావు, చిత్రోతు సీతారాంబాబు, చిత్రోతు సత్యలక్ష్మీ, చిత్రోతు రాణి, బరపాటి రంగారావు అనే వ్యక్తులు కలిసి తన భూమిలోకి అక్రమంగా వచ్చి రేకుల షెడ్డు వేశారని బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.

కేటీపీఎస్ స్విచ్ యార్డ్‌లో షార్ట్ సర్క్యూట్

ఇద్దరు ఆర్టిజన్ కార్మికులకు గాయాలు



గాయపడిన ఆర్టిజన్ కార్మికుడు కార్తీక్

కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఇద్దరు ఆర్టిజన్ కార్మికులకు గాయాలైన ఘటన పాల్వంచలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలో 220 కేవీ స్విచ్ యార్డ్‌లో బుధవారం సాంకేతిక సమస్య ఏర్పడి ట్రిప్ అయింది. కాగా, అధికారులు గురువారం కూడా మరమ్మతు పనులు నిర్వహించారు. దీంతో ఎర్తింగ్ పనులు పూర్తయ్యాక షార్ట్ సర్క్యూట్ జరిగి ఫ్లాష్ అయింది. ఈ ఘటనలో ఆర్టిజన్ కార్మికులు కార్తీక్, వెంకన్న గాయపడ్డారు. వెంటనే వారిని కేటీపీఎస్ ఆస్పత్రికి తరలించారు. వెంకన్నకు స్వల్ప గాయాలు కాగా, కార్తీక్ శరీర భాగాలు తీవ్రంగా కాలాయి. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

సుజాతనగర్: నకిలీ నోట్ల రవాణా చేసే ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సుజాతనగర్ పోలీసు స్టేషన్‌లో గురువారం సీఐ రాయల వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. మండల పరిధిలోని సీతంపేట బంజార గ్రామానికి చెందిన మాళోత్ రాంప్రసాద్, బానోత్ శ్రీనులకు ఖమ్మం జిల్లా బుగ్గపాడుకు చెందిన మంచాల వ్యాపారి బెజవాడ సురేష్‌కుమార్‌తో ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. అప్పటికే సురేష్‌కుమార్ రాజమండ్రికి చెందిన పెద్దగొళ్ల వంశీకృష్ణ, కాకినాడకు చెందిన సింగంశెట్టి సత్యఫణికుమార్, సిద్ధిపేటకు చెందిన రాకేష్‌లు ముఠాగా ఏర్పాడి రాజమండ్రి కేంద్రంగా నకిలీనోట్ల దందా సాగిస్తున్నారు. రూ. లక్షకు రూ. 3 లక్షల నకిలీ నోట్లు ఇస్తామని నమ్మబలికి బానోత్ శ్రీను, రాంప్రసాద్ వద్ద నుంచి రూ.7.50 లక్షలు తీసుకున్నారు. అనంతరం చిన్న పిల్లలు ఆడుకునే రూ.500 నోట్ల కట్టలను ఇచ్చి మోసం చేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గురువారం నలుగురు నిందితులు సుజాతనగర్ మండలం నాయకులగూడెం వద్ద నకిలీనోట్లను మార్చేందుకు ప్రయత్నం చేస్తుండగా పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, రాకేష్ అనే వ్యక్తి పారిపోయాడు. నిందితుల నుంచి రూ.4 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా కేసు ఛేదించిన ఎస్‌ఐ జుబేదా బేగంను సీఐ అభినందించారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

గుండాల: నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. గుండాల మండల కేంద్రంలో బుధ, గురువారాల్లో పలు కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. రూ. 12 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


బైక్ చెట్టును ఢీకొని యువకుడి మృతి



సదీన్(ఫైల్)

కరకగూడెం: ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన పినపాక మండల పరిధిలోని ఐలాపురం గ్రామం వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన మద్దెల సదీన్ (23)లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మణుగూరు నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా ఐలాపురం మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో అతను ఎగిరి సుమారు 10అడుగుల గోతిలో పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటప్పయ్య తెలిపారు.

గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలింపు



గాయపడ్డ వ్యక్తిని ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న కానిస్టేబుల్

కొత్తగూడెం అర్బన్(పాల్వంచ): రోడ్డు ప్రమాదంలో గాయపడి రోడ్డు పక్కన పడి ఉన్న వ్యక్తిని ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు గుర్తించి ఆటోలో ఆస్పత్రికి తరలించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ శాంతి థియేటర్ దగ్గర కుంజ ఉగ్ర అనే వ్యక్తి చిన్నపాటి రోడ్డు ప్రమాదానికి గురై రోడ్డు పక్కన పడి ఉన్నాడు. దీంతో గమనించిన కానిస్టేబుళ్లు కృష్ణ, ఇరియా ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ సందర్భంగా కానిస్టేబళ్లను పలువురు అభినందించారు.

అడవిపంది మాంసం స్వాధీనం?

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గాండ్లగూడెం గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న అడవి పంది మాంసాన్ని గురువారం ఫారెస్టు రేంజర్ మురళి పట్టుకున్నారు. సుమారు కేజీ మాంసం పట్టుకుని అశ్వారావుపేట ఫారెస్టు రేంజ్ కార్యాలయానికి తరలించారు. ల్యాబ్‌లో పరీక్షించాక అడవి పంది మాంసంగా నిర్ధారణ అయితే సదరు వ్యక్తిపై కేసు నమోదు చేస్తామని రేంజర్ తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఓ అరుణ్ కుమార్, బీట్ ఆఫీసర్లు రమేష్, రాజశేఖర్ ఉన్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

మిర్యాలగూడ: పాల్వంచకు చెందిన యువతి నల్లగొండ జిల్లా దామరచర్లలో గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. పాల్వంచకు చెందిన దొడ్ల సురేష్ దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగం పనిచేస్తూ దామరచర్లలో నివాసముంటున్నాడు. కొన్నాళ్లుగా ఆయనతో పాల్వంచకే చెందిన ప్రియాంక(34) నివసిస్తున్నట్లు సమాచారం. అయితే, వీరి నడుమ గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన ఆమె గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈవిషయాన్ని సురేష్ గమనించి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకుని అప్పటికే ప్రియాంక మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసులు సురేష్‌ను అదుపులోకి తీసుకుని ప్రియాంకది ఆత్మహత్యా.. హత్యా అనే కోణంలో విచారణ చేపట్టారు.

కుళ్లిన గుడ్లు పంపిణీ

భద్రాచలం అర్బన్: పట్టణంలోని ముదిరాజ్ బజార్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడి గుడ్లు వెలుగుచూశాయి. ఈ నెలలో లబ్ధిదారులకు గుడ్లు అందించగా, రెండు కుటుంబాలకు కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేశారు. దీంతో బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు గురువారం అంగన్‌వాడీ కేంద్రం వద్దకు వచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఎమ్మార్పీఎస్ నాయకులు అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్, కాంట్రాక్టర్ కుమ్మక్కై నాసిరకం గడ్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెల్లం సమ్మక్క, కొంచర్ల కుమారి, గద్దల కృష్ణవేణి, కొప్పుల నాగమణి, ఎస్కే సల్మా, ఇల్లందుల హేమలత, చిప్పనపల్లి సమత తదితరులు పాల్గొన్నారు. కాగా కేంద్రంలోని గుడ్లను వెనక్కు తీసుకెళ్లాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి తెలిపారు.

ఛత్తీస్‌గఢ్ పోలీసుల అదుపులో చర్ల వాసులు?

చర్ల: చర్లకు చెందిన ఐదుగురు వ్యక్తులను గురువారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవల చర్లకు చెందిన ఓ యువకుడు మావోయిస్టులకు అవసరమైన సామగ్రి తీసుకెళ్తూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం. అతడిని విచారించాక, పోలీసులు చర్లకు వచ్చి మరో ఐదుగురిని అదుపులోకి తీసుకుని బీజాపూర్ తరలించినట్లు తెలిసింది.

అల్లుడిపై మామ కొడవలితో దాడి

మణుగూరుటౌన్/మంగపేట: భార్యను తీసుకెళ్లేందుకు అత్తగారింటికి వచ్చిన అల్లుడిపై మామ కొడవలితో దాడి చేశాడు. ఈ ఘటన ములుగు జిల్లా మంగపేట మండలం రామచంద్రునిపేటలో గురువారం జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మణుగూరు మండలం పగిడేరు గ్రామానికి చెందిన నాంపెల్లి విజయ్ పినపాక మండలం బయ్యారంలో రెస్టారెంట్ నడుపుతున్నాడు. నెల రోజుల క్రితం విజయ్‌తో భార్య గొడవపడి తన పుట్టినిల్లు అయిన మంగపేట మండలం రామచంద్రునిపేటకు వచ్చింది. ఈ క్రమంలో విజయ్ గురువారం భార్యను తీసుకెళ్లేందుకు తన తల్లితో కలిసి కారులో వచ్చారు. ఈ క్రమంలో మామ అల్లుడు వెంకన్న, విజయ్‌లు గొడవపడ్డారు. అల్లుడి విజయ్‌పై మామ వెంకన్న కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. విజయ్‌ను చికిత్స నిమిత్తం మణుగూరుకు, అక్కడి నుంచి భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం.

డీర్ పార్కులో మూషిక జింక మృతి

పాల్వంచరూరల్: డీర్ పార్కులో పెరుగుతున్న మూషిక జింక మృతిచెందిన విషయం ఆలస్యంగా గురువారం వెలుగుచూసింది. మండల పరిధిలోని కిన్నెరసాని డీర్ పార్కులో ప్రత్యేక షెడ్ నిర్మించి, ఆరేళ్లుగా ఐదు మూషిక జింకలను పెంచుతున్నారు. ఈ నెల 7న ఒక మూషిక జింక మృతి చెందగా, వెటర్నరీ వైద్యుడితో పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక జింక మృతికి కారణం తెలుస్తుందని రేంజర్ శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

గుండాల: మేతకు వెళ్లిన రెండు గేదెలు విద్యుదాఘాతంలో మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేకుంది. ఆళ్లపల్లి మండలం అనంతోగు పంచాయతీ తిర్లాపురం గ్రామానికి చెందిన పడిగె సుశీల, పూనెం పద్మలకు చెందిన పాడి గేదెలు బుధవారం మేతకు వెళ్లాయి. కాగా గురువారం సాయంత్రానికి కూడా రాకపోవడంతో వెతకడం ప్రారంభించారు. గురువారం తెల్లవారు జామున గ్రామ సమీపంలో కరెంటు తీగలు తెగిపడి ఉండడంతో ఆ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు గుర్తించారు. రైతులకు సుమారు రూ. రెండు లక్షల నష్టం జరిగిందని, వారిని ఆదుకోవాలని ఆళ్లపల్లి వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు.